క్లుప్తంగా

రెండు రోజులు నీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: వరంగల్ అండర్ రైల్వే జోన్‌కు నీటి సరఫరా జరిగే ధర్మసాగర్ నుంచి వచ్చే ప్రధాన పైపులైన్ అమ్మవారి పేటకు వెళ్లే రోడ్డులో ధ్వంసమైంది. ఈ క్రమంలో మరమ్మతులు కొనసాగుతున్నందున బుధ, గురువారాల్లో తాగునీటి సరఫరా ఉండదని బల్దియా ఇన్‌చార్జ్ ఎస్ఈ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ రైల్వే జోన్ పరిధిలోని కరీమాబాద్, ఎస్ఆర్ఆర్ తోట, ఖిలా వరంగల్, శివనగర్, ఉర్సు, కరీమాబాద్, చింతల్, పెరుకవాడ ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదని పేర్కొన్నారు.

నేడు ద్విచక్రవాహనం వేలం

మడికొండ: మడికొండ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఉదయం టీఎస్27 ఏ1066 నంబర్ గల పల్సర్ బైక్‌ను వేలం వేయనున్నట్లు ఇన్‌స్పెక్టర్ కిషన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు షార్ట్ ఫిలిం సీడీ ఆవిష్కరణ



వరంగల్ చౌరస్తా: ఆరుగాలం కష్టపడి పండించిన పంటకు సరైన ధర రాక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రైతు సంఘం నాయకులు తెలిపారు. వరంగల్ అబ్బనికుంటలో తెలంగాణ రైతు సంఘం భవనంలో మంగళవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న రైతులను చైతన్యపరిచే విషయాలపై తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో రూపకల్పన చేసిన సీడీ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుందని అన్నారు. సమావేశంలో సోమ రామ్మూర్తి, సోమిడి శ్రీనివాస్, ఓదెల రాజయ్య, నాయకులు ఐతం నగేష్, ఊరటి అంకాలరెడ్డి, సిర్ల రవీందర్, సోమిడి సాంబయ్య, ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో జైలు, జరిమానా

రామన్నపేట: మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఇద్దరికి రెండు రోజుల జైలుశిక్ష, 23 మందికి రూ.24,900 జరిమానా విధిస్తూ జడ్జి అబ్బోజు వెంకటేశం తీర్పు వెల్లడించినట్లు వరంగల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.రామకృష్ణ తెలిపారు. అలాగే, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతూ పట్టుబడిన ఒకరికి రూ.500 జరిమానా విధిస్తూ జడ్జి తీర్పులో పేర్కొన్నట్లు వివరించారు.

ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



కాజీపేట రూరల్: నెల రోజుల వేసవి శిక్షణ ముగింపు కార్యక్రమాన్ని కాజీపేట సెయింట్ గ్యాబ్రియల్ హైస్కూల్ ఆవరణంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కాజీపేట ఎస్సై శివకృష్ణ, గ్యాబ్రియల్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆంటోని పాలిశెట్టి మాట్లాడుతూ వేసవి శిక్షణలో నేర్చుకున్న విషయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. శిక్షణ నిర్వాహకులను స్కూల్ పీఈటీ పులి విజయ్‌కుమార్, తదితరులు అభినందించారు.

'మెడికవర్'లో అరుదైన శస్త్ర చికిత్స

కాజీపేట అర్బన్: హనుమకొండ హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో నగరానికి చెందిన 42 ఏళ్ల వ్యక్తికి ఒకేసారి రెండు అరుదైన శస్త్ర చికిత్సలను నిర్వహించారు. వైద్యుడు, కన్సల్టెంట్ యూరాలజిస్ట్ శిరీష్ భరద్వాజ్ మాట్లాడుతూ ఎనిమిదేళ్లుగా శరీరంలో విరిగి ఉండిపోయిన డీజే స్టంట్‌తో బాధపడుతున్న వ్యక్తికి మూత్రపిండాన్ని తొలగించకుండా శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు వివరించారు. ప్రస్తుతం రోగి ఆరోగ్యంగా ఉన్నాడని తెలిపారు.

ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు అభినందన



కేయూ క్యాంపస్: కర్ణాటక రాష్ట్రం మంగళూరులోని యేనిపోయా డీమ్డ్ టూ బి యూనివర్సిటీలో ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించిన ఇంటర్నేషనల్ కాన్ఫరెన్స్ ఐకాన్ యూత్-2025లో కాకతీయ యూనివర్సిటీలోని బయో టెక్నాలజీ విభాగానికి చెందిన ఇద్దరు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు గుజ్జర వికాస్‌తేజ, శ్రీజా జాదవ్ పాల్గొన్నారు. ఇన్నోవేటివ్ హోరిజన్స్ ఐడియాథన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మటివ్ స్టార్టప్స్ అనే అంశంపై వికాస్‌తేజ, ఎన్వైసినింగ్ ఇండియా ఫ్యూచర్ యూత్ యాస్ చేంజ్ మేకర్ థీమ్‌పై శ్రీజా జాదవ్ పోస్టర్లు ప్రదర్శించారు. ఈమేరకు వారిని కేయూ వీసీ ప్రొఫెసర్ ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి ప్రొఫెసర్ ఈసం నారాయణ, డాక్టర్ రాధిక మంగళవారం అభినందించారు.

సుందరయ్యకు నివాళి

ఖిలా వరంగల్: సీపీఎం నేత పుచ్చలపల్లి సుందరయ్య 40వ వర్ధంతిని వరంగల్ శివనగర్ ఏసీరెడ్డినగర్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకురాలు నలిగంటి రత్నమాల, ఠాగూర్ భవాని, పూరెళ్ల రాధక్క, ప్రతాపగిరి నీలమ్మ, సునీత, లక్ష్మి, వజ్రమ్మ, సదయ్య, మేఘమాల, అరుణ పాల్గొన్నారు.

టిప్పర్ల వేగానికి కళ్లెం పడేనా?

- రేగడి మట్టితో వేగంగా వెళ్తున్న టిప్పర్ వాహనాలతో రోడ్డు ప్రమాదాలు
- ప్రాణాలు కోల్పోతున్న వాహనదారులు



హంటర్‌రోడ్డులో రేగడి మట్టితో వెళ్తున్న టిప్పర్

ఖిలా వరంగల్ : ఇటీవల వరంగల్ హంటర్ రోడ్డుపై టిప్పర్లు ఢీకొనడంతో ముగ్గురు ద్విచక్రవాహనదారులు దుర్మరణం చెందారు. చాలామంది క్షతగాత్రులుగా మారారు. రాత్రి వేళలో వేగంగా వెళ్తూ వాహనాలను టిప్పర్లు ఢీకొనడంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. వాయువేగంతో దూసుకెళ్తున్న రేగడి మట్టి లోడ్ టిప్పర్ల కారణంగా చాలామంది ప్రజలు బలవుతున్నారు. మరెందరో గాయపడుతున్నా.. వాటి వేగానికి కళ్లెం మాత్రం పడడం లేదు. పగలు, రాత్రి అడ్డూ అదుపు లేకుండా మితిమీరిన వేగంతో దూసుకెళ్తున్నాయి. వరంగల్ భద్రకాళి చెరువులో పూడికతీత పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఆ రేగడి మట్టిని వ్యాపారులు టిప్పర్లల్లో ఇటుక బట్టీలకు తరలిస్తున్నారు. హనుమకొండ హంటర్ రోడ్డు మీదుగా వరంగల్ ఉర్సుగుట్ట, ఆర్టీఏ జంక్షన్ మీదుగా నక్కలపల్లి వరకు వేగంగా ప్రయాణిస్తున్నాయి. ఎక్కువ ట్రిప్పులు చేయాలన్న టిప్పర్ల యాజమాన్యం ఆదేశాలు మేరకు డ్రైవర్లు ఇష్టానుసారంగా దూసుకెళ్తుండటంతో పాదచారులు, వాహన చోదకులు భయభ్రాంతులకు గురవుతున్నారు. కొంతమంది డ్రైవర్లు మద్యం తాగి వాహనాలు నడపడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు.

ఓవర్‌లోడ్‌తో ప్రయాణం

భద్రకాళి చెరువు నుంచి వాహన పరిమితికి మించి రేగడి మట్టి తరలింపునకు పాల్పడుతున్నారు. అనుమతితోనే తీసుకు పోతున్నామనే ధీమాతో వందలాది టిప్పర్లు ఓవర్ లోడ్‌తో వెళ్తున్నాయి. వెళ్లే క్రమంలో రోడ్లపై రేగడి మట్టి కింద పడడం వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉర్సుగుట్ట రహదారిపై రాత్రింబవళ్లనే తేడా లేకుండా రాకపోకలు సాగిస్తున్నాయి. టిప్పర్ల యజమానులు డ్రైవర్లకు లక్ష్యాలు విధిస్తుండడంతో ఒక్కొక్కరూ 30 ట్రిప్పులకు పైగా చేస్తున్నారు. ఈ క్రమంలో ప్రమాదాలకు రేగడి మట్టి ఓవర్‌లోడు ఒక కారణమైతే.. టిప్పర్లు వేగంగా దూసుకెళ్లడం మరో కారణంగా చెప్పొచ్చు.

వాహనాలను సీజ్ చేయాలి



జాతీయ రహదాదారులపై వాహనాలు ఓవర్‌లోడ్‌తో పగలు, రాత్రి ప్రయాణిస్తున్నాయి. మద్యం మత్తు, అతివేగం నిర్లక్ష్యం డ్రైవింగ్ వల్ల ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. అధికారులు దాడులు చేసి ఓవర్ లోడ్ వాహనాలను సీజ్ చేయాలి.

– నాగరాజు, కరీమాబాద్ వరంగల్

వేగ నియంత్రణకు చర్యలు



వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారి మీదుగా టిప్పర్లు వేగంగా వెళ్తుండడంతో ప్రమాదాలు జరుగుతున్నట్లు మా దృష్టికి వచ్చింది. అధిక వేగానికి కళ్లెం వేసి కేసులు నమోదు చేస్తున్నాం. ఓవర్ లోడ్‌తో వెళ్తున్న టిప్పర్లను సీజ్ చేసి యజమానులు, డ్రైవర్లకు జరిమానాలు విధిస్తున్నాం.

– శోభన్‌బాబు, ఇన్‌చార్జ్ ఆర్టీఓ, వరంగల్

సఖి సేవలను వినియోగించుకోవాలి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న శ్రీదేవి, మహిళలు

కాజీపేట అర్బన్: బాధిత మహిళలు, బాలికలు సఖి కేంద్రం అందజేస్తున్న సేవలను వినియోగించుకోవాలని సఖి వన్‌స్టాప్ సెంటర్ లీగల్ కౌన్సిలర్ శ్రీదేవి సూచించారు. కాజీపేట మండలం న్యూశాయంపేటలోని కమ్యూనిటీ హాల్‌లో సఖి వన్‌స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన మహిళా చట్టాలపై అవగాహన సదస్సులో శ్రీదేవి మాట్లాడారు. మహిళా చట్టాలపై ప్రతీ మహిళ అవగాహన కలిగి ఉండాలని అన్నారు. గృహ హింస, లైంగిక వేధింపులు, ఆపదలోని మహిళలకు సఖి వన్‌స్టాప్ సెంటర్ తాత్కాలిక వసతి, వైద్య, పోలీస్, న్యాయ సలహాలను అందజేస్తోందని వివరించారు. బాధిత మహిళలు, బాలికలు టోల్‌ఫ్రీ నంబర్ 181, 0870 2452112, 73829 83088 నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు. అనంతరం సఖి సేవల కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సఖి కేస్ వర్కర్ భారతి, సునీత, స్థానిక మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించండి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రకాష్‌రావు

నయీంనగర్: గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపల్లి శ్రీరాఘవేంద్రనగర్ కాలనీలోని సమస్యలు పరిష్కరించాలని కాలనీ అధ్యక్షుడు పిన్నింటి ప్రకాష్‌రావు కోరారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రకాష్‌రావు మాట్లాడుతూ కనీస సౌకర్యాలు లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. సమావేశంలో మామిడిపల్లి చిరంజీవి, ఆంజనేయులు, తిరువూరు దేవిప్రసాద్, రాములు, నర్సింగరావు, మహేందర్ పాల్గొన్నారు.

కనీస వసతులు కల్పించాలని నిరసన



నిరసన తెలుపుతున్న స్థానికులు

మడికొండ: 46వ డివిజన్‌లోని ఎస్సీ, బీసీ కాలనీలో కనీస వసతులు కల్పించాలని కాలనీవాసులు నిరసన తెలిపారు. పదేళ్లుగా కాలనీలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని తెలిపారు. కాలనీలో సీసీ రోడ్డు, సైడ్ డ్రెయినేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. దుబాసి పద్మారావు, మద్దెల కుమార్, క్రాంతి, ప్రమీల, విజయ, కాలనీవాసులు పాల్గొన్నారు.

ప్రసన్నాంజనేయ స్వామి బ్రహ్మోత్సవాలు



వడమాలల అలంకరణలో ప్రసన్నాంజనేయ స్వామి

హన్మకొండ అర్బన్: నగరంలోని పద్మాక్షి కాలనీలోని హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఏడో రోజు మంగళవారం ఉదయం స్వామివారికి గణపతి పూజ, నవగ్రహ మన్య సూక్తాహవనం నిర్వహించి వడమాలల అలంకరణ చేసినట్లు ఆలయ అర్చకుడు ఆరుట్ల రామాచార్యులు తెలిపారు. సోమవారం నుంచి మంగళవారం ఉదయం వరకు తెనాలి బృందం ఆధ్వర్యంలో ఏకనామ (హరే రామ హరే కృష్ణ) పారాయణం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మాలధారులు, భక్తులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బుధవారం ఉదయం ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం నుంచి బాలాంజనేయ స్వామి గుడి మీదుగా చౌరస్తా వరకు హనుమాన్ శోభాయాత్ర ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో శ్రీహనుమాన్ దీక్ష సేవ సమితి అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, సభ్యులు దశరథ్‌కుమార్, మాదాసు మొగులయ్య, గంద్రతి సుధాకర్, గంట సత్యం, సీతా సమ్మయ్య, శంకర్ పాల్గొన్నారు.

28న విశ్వకర్మీయ అభినందన సభ



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖిలా వరంగల్: ఈనెల 28న వరంగల్ కీర్తిగార్డెన్‌లో నిర్వహించనున్న విశ్వకర్మల అభినందన సభను విజయవంతం చేయాలని అఖిల భారత విశ్వకర్మ పరిషత్ జాతీయ అధ్యక్షుడు రాచమల్ల పున్నమాచార్యులు, ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కందోజు వీరచార్యులు కోరారు. శివనగర్‌లోని విశ్వకర్మ భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో కరపత్రాలను వారు ఆవిష్కరించి మాట్లాడారు. విశ్వకర్మలకు రాష్ట్ర ప్రభుత్వం 200 యూనిట్లలోపు ఉచిత కరెంట్ అందజేస్తోందని గుర్తుచేశారు. కార్యక్రమంలో బిట్ల చక్రపాణి, నామోజు జగన్నాథం, అబ్బోజు వీరాచార్య, కుమారస్వామి, వీరాచార్య, ముపోజు గజదీశ్వరాచార్య, గురుమూర్తి, కనకాచారి, రాంమూర్తి, ఆకుతోట శ్రీనివాస్ పాల్గొన్నారు.

31న తెలంగాణ జర్నలిస్ట్స్ ఫోరం రజతోత్సవం



రజతోత్సవ సంబురాల వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు, జర్నలిస్టులు

హన్మకొండ: ఈనెల 31న నిర్వహించనున్న తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం రజతోత్సవ సంబురాలను విజయవంతం చేయాలని తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (ఎ–143) హనుమకొండ జిల్లా అధ్యక్షుడు మస్కపురి సుధాకర్, కార్యదర్శి అర్షం రాజ్‌కుమార్ పిలుపునిచ్చారు. హనుమకొండ సుబేదారిలోని అమరుల కీర్తిస్తూపం వద్ద టీజేఎఫ్ రజతోత్సవాల వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ జర్నలిస్ట్ ఫోరం ఆవిర్భవించి మే 31 నాటికి 25వ వసంతంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా హైదరాబాద్ జలవిహార్‌లో సంబురాలు నిర్వహించనున్నట్లు వివరించారు. కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బీఆర్.లెనిన్, జిల్లా కోశాధికారి పొగాకుల ప్రభాకర్, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బూరం ప్రశాంత్, తాళ్లపల్లి వేణుగోపాల్, నాయకులు పిన్నింటి గోపాల్, పొగాకుల అశోక్, దొంతు నవీన్, పబ్బు సతీష్, ఆరెల్లి కిరణ్, తాళ్లపల్లి వెంకన్న, వెంకటరత్నం, గొట్టె వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా

కాజీపేటలో ఆపరేషన్ సిందూర్ ర్యాలీ

కాజీపేట రూరల్: కాజీపేట రైల్వే స్టేషన్ నుంచి మంగళవారం ప్రారంభమైన ఆపరేషన్ సిందూర్ ర్యాలీ రైల్వే జనరల్ ఇనిస్టిట్యూట్, కాజీపేట చౌరస్తా మీదుగా రైల్వే ఏడీఈఎన్ కార్యాలయం, సీసీసీ రైల్వే డ్రైవర్ల కార్యాలయం, రైల్వే స్టేషన్ స్టేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా డీజిల్ లోకోషెడ్ రైల్వే సీనియర్ డీఎంఈ ఎన్వీ.వెంకటకుమార్ మాట్లాడుతూ దక్షిణ మధ్య రైల్వే అధికారుల ఆదేశానుసారం ఈ ర్యాలీని నిర్వహించినట్లు తెలిపారు. ర్యాలీలో రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ సుభాష్, కాజీపేట ఆర్పీఎఫ్ సీఐ చటర్జీ, రైల్వే ఎలక్ట్రిక్ లోకోషెడ్ సీనియర్ డీఈఈ ప్రశాంత్ కృష్ణసాయి, డీఎంఈ అంకిత్ ఖడ్గే, ఏడీఎంఈ –2 నాగరాజశేఖర్, ఏసీఎంటీ రవీంద్రకుమార్, ఏడీఈఈ ఫణికుమార్, ఏడీఈఎన్ రామకృష్ణరాజు, కాజీపేట రైల్వే స్టేషన్ మేనేజర్ అగ్గి రవీందర్, రైల్వే హెల్త్ ఇన్‌స్పెక్టర్ సురేష్ బైరవ, సీటీఎస్ రమేష్, రైల్వే నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

పోలసమాజ కార్యవర్గం ఎన్నిక

హన్మకొండ చౌరస్తా: హనుమకొండ పోలసమాజ నూతన కార్యవర్గం ప్రత్యేక సమావేశం హనుమకొండలోని సెంటినరీ బాప్టిస్టు చర్చి ఆవరణలో మంగళవారం జరిగింది. రెవ గంధ అరుణ్‌జేమ్స్ అధ్యక్షతన జరిగిన ఆయా సంఘాల కాపరుల నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన ఫీల్డ్ ప్రెసిడెంట్ గంధం అరుణ్‌జేమ్స్, వైస్ ప్రెసిడెంట్ డేవిడ్ రాజ్ కుమార్, కార్యదర్శిగా మేకల డానియల్, జాయింట్ సెక్రటరీగా అచ్చుకట్ల గోపాల్, ట్రెజరర్‌గా తీగల మోహన్, జాయింట్ ట్రెజరర్‌గా పోలెపాక సీతయ్య, రికార్డింగ్ సెక్రటరీగా నలిగంటి అన్వేష్, కార్యవర్గ సభ్యులుగా మేరుగు యోసేపు, జీజేమ్స్ ఎబినేజర్, విజయరావు, శ్యాంసుందర్, సురేష్, అబ్రహం ఎన్నికయ్యారు.

'నవచేతన' పుస్తక ప్రదర్శన



హన్మకొండ చౌరస్తా: హనుమకొండ అశోకా కాంప్లెక్స్‌లోని నవచేతన బుక్‌హౌజ్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన పిల్లల పుస్తక ప్రదర్శనను మంగళవారం నవచేతన విజ్ఞాన సమితి గవర్నింగ్ బాడీ సభ్యుడు తక్కళ్లపెల్లి శ్రీనివాసరావు ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసానికి దోహదపడుతుందని చెప్పారు. అన్ని రకాల పుస్తకాలపై 10శాతం నుంచి 30శాతం వరకు ప్రత్యేక రాయితీ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ ప్రదర్శన జూన్ 10వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, రాష్ట్ర సమితి సభ్యుడు ఆదరి శ్రీనివాస్, నవచేతన బుక్‌హౌజ్ మేనేజర్ ఎర్ర నాగరాజు, టీయూడబ్ల్యూజే జిల్లా ప్రధాన కార్యదర్శి తోట సుధాకర్, నాయకులు ఏదునూరి వెంకట్రాజం, దండు మోహన్, ఎండీ.ఉస్మాన్‌పాషా, తాండూరి గోపి, కిషోర్‌కుమార్, సిబ్బంది రమేష్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

డబుల్ బెడ్రూం ఇళ్లు ఇవ్వాలి

న్యూశాయంపేట: స్థానికంగా భూమి కోల్పోయిన ప్రతీ కుటుంబానికి ఎలాంటి ఆంక్షలు లేకుండా డబుల్ బెడ్రూం ఇళ్లు మంజూరు చేయాలని సీపీఎం హనుమకొండ జిల్లా కార్యదర్శి జి.ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈమేరకు పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని మంగళవారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాలసముద్రంలోని జితేందర్‌నగర్, అంబేడ్కర్ నగర్‌లోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ పేద కుటుంబాలకు డబుల్ బెడ్రూం ఇళ్లు కేటాయించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్, చక్రపాణి, సంపత్, మధు, రఘు తదితరులు పాల్గొన్నారు.

అదుపు తప్పి ఆటో బోల్తా..

ఖిలా వరంగల్: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఆటో అదుపు తప్పి బోల్తా పడడంతో ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ఘటన మంగళవారం మధ్యాహ్నం వరంగల్ రంగశాయిపేట వాటర్ ట్యాంక్ సమీపంలో జరిగింది. స్థానికులు కథనం ప్రకారం.. వరంగల్ అండర్ బ్రిడ్జి నుంచి బయల్దేరిన ఆటో.. ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి బోల్తాపడింది. దీంతో ఆటోలోని ముగ్గురు ప్రయాణికులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

కక్షపూరిత కుట్రలు సరికావు

వరంగల్ చౌరస్తా: అంతర్గత విబేధాలతో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేందర్‌పై కక్షపూరిత కుట్రలు పన్ని బూటకపు కేసు బనాయించడం దారుణమని బీజేపీ నాయకుడు కుసుమ సతీష్ విమర్శించారు. వరంగల్ రాంకీ ఎన్‌క్లేవ్‌లో నరేందర్‌ను పద్మశాలి సంఘం నాయకులు మంగళవారం పరామర్శించారు. అఖిల భారత పద్మశాలి సంఘ వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు డీఎస్.మూర్తి మాట్లాడుతూ సీనియర్ ప్రజాప్రతినిధిని అక్రమంగా అరెస్ట్ చేయడం శోచనీయమని అన్నారు. గోరంట్ల రాజు, బైరి మురళీకృష్ణ, బైరి శ్యాంసుందర్, కూచన క్రాంతికుమార్, మాచర్ల దీన్‌దయాళ్ పాల్గొన్నారు.

'మోదీ పాలనలో హక్కుల హననం'



మాట్లాడుతున్న శంకర్‌నారాయణ

న్యూశాయంపేట: కేంద్రంలోని మోదీ పాలనలో ప్రజల హక్కుల హననం జరుగుతోందని సీపీఐ హనుమకొండ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి అన్నారు. రిటైర్డ్ అసిస్టెంట్ ప్రొఫెసర్, అరసం ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ మార్క శంకర్‌నారాయణ అధ్యతన హనుమకొండలోని పార్టీ కార్యాలయంలో జిల్లా కేంద్రశాఖ మహాసభ మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా భిక్షపతి మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి కార్పొరేట్ శక్తులకు దాసోహం అయిందని విమర్శించారు. ప్రజాస్వామిక వాదుల గొంతులను అణిచివేస్తూ రాజ్యాంగంలోని అంశాలను తుంగలో తొక్కిందన్నారు. శంకర్‌నారాయణ మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ పేరుతో ఆదివాసీలను కేంద్రం హత్య చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. కేంద్రం ఫాసిస్ట్ చర్యలను మేధావులు, విద్యార్థులు ఐక్యంగా వ్యతిరేకించాలని సూచించారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఆదరి శ్రీనివాస్, వెంకట్రాజం, టి.సుధాకర్, దండు మోహన్, ఉస్మాన్‌పాషా, గోపి, నాగరాజు, రోహిత్, కిషోర్‌కుమార్, రాజు పాల్గొన్నారు. అనంతరం, జిల్లా కేంద్ర కార్యదర్శిగా టి.సుధాకర్, సహాయ కార్యదర్శిగా ఎండీ.ఉస్మాన్‌పాషా, మరో ఐదుగురితో కూడిన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

ఉగ్ర పన్నాగాలను పసిగట్టడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న అశోక్

వరంగల్ చౌరస్తా: దేశంలో ఉగ్రవాదుల పన్నాగాలను పసిగట్టడంలో కేంద్ర ప్రభుత్వం విఫలం చెందిందని, ఈ క్రమంలోనే పహల్గాంలో పర్యటకులపై ఉగ్రవాదుల పైశాచిక దాడి జరిగిందని ఎంసీపీఐ(యూ) జాతీయ ప్రధాన కార్యదర్శి మద్దికాయల అశోక్ విమర్శించారు. వరంగల్ అండర్ బ్రిడ్జి ఓంకార్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సమావేశం షేక్ నజీర్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ దేశంలో మోదీ ప్రభుత్వ విధానాల వల్ల కార్మికులు, కర్షకులు, ప్రజలు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాపోయారు. ఏ లక్ష్యం లేకుండానే పాకిస్తాన్‌పై యుద్ధం ప్రకటించి ఎంతో సాధించామని ప్రకటించుకోవడం సిగ్గుచేటు అని అన్నారు. సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి గాదగోని రవి, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వల్లెపు ఉపేందర్ రెడ్డి, వనం సుధాకర్, కుంభం సుకన్య, వసుకుల మట్టయ్య, వరికుప్పల వెంకన్న, గోనె కుమారస్వామి, పెద్దారపు రమేష్, ఎన్‌రెడ్డి హంసారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధికి కృషి

- ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి



శిలాఫలకం ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాయిని

హన్మకొండ: వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. హనుమకొండ వడ్డెపల్లి ఎస్సీ కాలనీలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డు విస్తీరణ పనులకు గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అశ్విని తానాజీ వాఖడేతో కలిసి మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో కనీస సదుపాయాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం నుంచి ప్రత్యేక నిధులు తీసుకువచ్చి నియోజకవర్గ అభివృద్ధికి పాటు పడుతున్నట్లు వివరించారు. అభివృద్ధిలో ప్రజలు కూడా భాగస్వాములు కావాలని కోరారు. కార్యక్రమంలో 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహితరాజు, కాంగ్రెస్ నాయకులు తాళ్లపల్లి సుధాకర్, ఎనుకంటి నాగరాజు, మండల సమ్మయ్య, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

- ఉద్యానశాఖ డివిజన్ అధికారి సుష్మిత

హసన్‌పర్తి: ఆయిల్ పామ్ తోటల సాగుతో అధిక లాభాలు పొందవచ్చని హనుమకొండ డివిజన్ ఉద్యానశాఖ అధికారి సుష్మిత అన్నారు. ఆయిల్ పామ్ సాగుపై హసన్‌పర్తి మండలం గంటూరుపల్లిలో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉద్యానశాఖ, కేఎన్ బయోసైన్స్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఆయిల్‌పామ్ టన్ను ధర రూ.21 వేలు ఉందని చెప్పారు. భీమదేవరపల్లిలోని కొత్తపల్లి, ఎల్కతుర్తి మండలంలోని బాహుపేటలో ఆయిల్‌పామ్ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు వివరించారు. కార్యక్రమంలో కేఎన్ బయోసైన్స్ ఆఫ్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ జిల్లా మేనేజర్ రంజిత్, ఫీల్డ్ ఆఫీసర్ మహిపాల్, రైతులు పాల్గొన్నారు.

'ఉపాధి'లో అక్రమాలపై విచారణ

- కూలీల వాంగ్మూలం సేకరణ



కూలీలతో మాట్లాడుతున్న కర్ణాకర్‌రెడ్డి

సాక్షి స్పందన

హసన్‌పర్తి: హసన్‌పర్తి మండలం అన్నాసాగరం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో జరిగిన అవినీతి, అక్రమాలపై అధికారులు విచారణ చేపట్టారు. 'ఉపాధి'లో అక్రమాలు అనే కథనం ఇటీవల సాక్షి దినపత్రికలో ప్రచురితమైంది. ఈమేరకు ఆర్డీఏ మేన శ్రీను ఆగ్రహం వ్యక్తం చేస్తూ విచారణకు ఆదేశించారు. మండల అభివృద్ధి అధికారి కర్ణాకర్ రెడ్డి మంగళవారం క్షేత్రస్థాయికి వెళ్లి విచారణ చేపట్టారు. పనిచేసిన రోజులకు హాజరు వేస్తున్నారా, ఉన్నతాధికారులు క్షేత్రస్థాయికి వచ్చి పనులను పర్యవేక్షిస్తున్నారా అని కూలీలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా 48 మంది కూలీలతో పాటు ఈజీఎస్ సిబ్బంది, ఏపీఎంల వాంగ్మూలాన్ని సేకరించారు. అనంతరం విచారణాధికారి కర్ణాకర్‌రెడ్డి మాట్లాడుతూ నివేదికను జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తానని అన్నారు.

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

హన్మకొండ అర్బన్: కేంద్ర బీజేపీ ప్రభుత్వం ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంబిస్తూ తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్ డిమాండ్ చేశారు. జాతీయ కార్మిక సంఘాల పిలుపులో భాగంగా సీఐటీయూ, ఐఎన్‌టీయూసీ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో హనుమకొండ ఆర్ట్స్ కళాశాల ఆడిటోరియం నుంచి కలెక్టరేట్ వరకు మంగళవారం భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు.

కార్మికులను బానిసలుగా మార్చే కుట్ర

హన్మకొండ: కార్మికులను కట్టుబానిసలుగా మార్చే చట్టాలను కేంద్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఏఐటీయూసీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు బొట్ల భిక్షపతి, టీఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు బొట్ల భిక్షపతి మాదిగ డిమాండ్ చేశారు. దేశవ్యాప్త సమ్మెను జులై 9కి వాయిదా వేసిన క్రమంలో హనుమకొండలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏఐటీయూసీ, టీఎమ్మార్పీఎస్, తెలంగాణ రాష్ట్ర మున్సిపల్ స్టాఫ్ అండ్ ఔట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మంగళవారం ధర్నా చేశారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి

రామన్నపేట: జూలై 9న జరగనున్న సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్ పిలుపునిచ్చారు. సీకేఎం ఆస్పత్రిలో తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు.

కార్మిక చట్టాలను రద్దు చేయాలి

హసన్‌పర్తి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలను తక్షణమే రద్దు చేయాలని సీఐటీయూ మండల కన్వీనర్ పుల్లా అశోక్ డిమాండ్ చేశారు. ఈమేరకు హసన్‌పర్తి మండల కేంద్రంలో మంగళవారం నిరసన తెలిపారు.

అనుమానాస్పదంగా వృద్ధుడి మృతి

గీసుకొండ: ధర్మారం–స్తంభంపల్లి మార్గంలోని కోళ్లఫాం దగ్గర ఓ వృద్ధుడు అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. వరంగల్ గిర్మాజీపేటకు చెందిన చిట్టిమల్ల మనోహర్ (71) మంగళవారం కోళ్లఫాం దగ్గర చనిపోయి ఉన్నాడని స్థానికులు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి చేరుకొని మృతుడి కుటుంబ సభ్యులకు పోలీసులు సమాచారం అందించారు.